ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పార్క్ ఎడిషన్
EVENING 6 PM
సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 172 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 +https:www.prajarepublic.com + వెల - 1/-
సోమవారం 27 జనవరి 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole




# మహా కుంభమేళాలో అమిత్.. పుణ్యస్నానమాచరించిన కేంద్ర మంత్రి

కేంద్ర హెూం మంత్రి అమిత్ షా కుంభమేళాలో పాల్గొని అక్కడ పుణ్యస్నానం చేశారు.



**ప్రయాగ్‌రాజ్, జనవరి 27, (రిపబ్లిక్ న్యూస్):** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాకు భారీగా భక్తులు క్యూ కడుతున్నారు. సాధారణ ప్రజలతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు కూడా త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. తాజాగా కేంద్ర హెూం మంత్రి అమిత్ ఈ కుంభమేళాలో పాల్గొన్నారు. గంగ, యమున, సరస్వతి నదీ సంగమం వద్ద పుణ్యస్నానం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, యోగా గురు బాబారామ్‌దేవ్ కూడా పుణ్యస్నానమాచరించారు. మరోవైపు జనవరి 13న ప్రారంభమైన మహా కుంభమేళా వైభవోపేతంగా కొనసాగుతోంది. ఫిబ్రవరి 26 వరకు మొత్తంగా 45 రోజుల పాటు జరగనుంది. విదేశాల నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో పోటెత్తున్నారు. ఈనెల 29న మౌని అమావాస్య కావడంతో 8 నుంచి 10 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు (అమృత స్నానం) ఆచరించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తంగా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం వల్ల 12 లక్షల మందికి తాత్కాలిక ఉపాధి లభించిందని అంచనా. తాత్కాలిక వైద్య శిబిరాలతో 1.5 లక్షల మంది నర్సులు, పారామెడికల్స్, ఇతర వైద్య సిబ్బందికి అవకాశాలు లభించాయి.

# 'ప్రజలే ఫస్ట్'.. అంచనాల మేరకు పనిచేయాలి: సీఎం చంద్రబాబు

రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలులో ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.





**అమరావతి, జనవరి 27, (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలులో ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఐవీఆర్ఎస్ పాటు వివిధ రూపాల్లో లబ్ధిదారుల నుంచి నేరుగా సేకరించిన సమాచారం ఆధారంగా ఆయా శాఖల పనితీరుపై సమీక్షించారు. పింఛన్ల పంపిణీ, దీపం పథకం అమలు, అన్న క్యాంటీన్ నిర్వహణ, ఇసుక సరఫరా వంటి పథకాలు, పాలసీలపై వివిధ రూపాల్లో సమాచారం సేకరించారు. గ్రామస్థాయి వరకు సిబ్బంది, ఉద్యోగులు, అధికారులపై వచ్చిన ఫీడ్ బ్యాక్ పైనా అధికారుల నివేదిక తీసుకున్నారు. 'ప్రజలే ఫస్ట్' అనే విధానంలో ప్రజల అభిప్రాయాలు, అంచనాల మేరకు పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. 7 శాఖల్లో పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాలపై సేకరించిన సర్వే ఫలితాలపై అధికారులు ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రజల సంతృప్తి అంశంలో క్షేత్ర స్థాయి వాస్తవ పరిస్థితుల ఆధారంగా ముందుకు వెళ్లేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చంద్రబాబు తెలిపారు.

# భారత విద్యారంగం సర్టిఫికేట్ల వ్యవస్థగా మారింది :రాహుల్ గాంధీ

దేశ విద్యా రంగంపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు.



**భోపాల్, జనవరి 27, (రిపబ్లిక్ న్యూస్):** భాజపా, ఆర్ఎస్ఎస్‌ల పై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో స్వాతంత్ర్యం పూర్వం నాటి పరిస్థితులను కోరుకుంటున్నాయని ఆరోపించారు. ప్రజలను మరోసారి బానిసలుగా మారుస్తున్నారని ఆరోపణలు చేశారు. మధ్యప్రదేశ్లోని మహులో నిర్వహించిన సభలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

"ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ రాజ్యాంగంపై దాడికి పాల్పడుతున్నారు. భాజపా, ఆర్ఎస్ఎస్ నుంచి కాంగ్రెస్ రాజ్యాంగాన్ని కాపాడే ప్రయత్నం చేస్తోంది. దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం నాటి పరిస్థితులను భాజపా, ఆర్ఎస్ఎస్ మళ్లీ కోరుకుంటున్నాయి. దళితులు, వెనుకబడిన వర్గాలు, ఆదివాసీలు, పేదలను మరోసారి బానిసలుగా మారుస్తున్నాయి. రాజ్యాంగం మారిన రోజు ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలు ఉండవు" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

### ఎక్కడా ఉపాధి ఉండదు..

ఈ సందర్భంగా రాహుల్ దేశ విద్యా వ్యవస్థ గురించి ప్రస్తావించారు. "ప్రైవేటు వ్యవస్థలో విద్య, వైద్య రంగాల యాజమాన్యం ఎవరి చేతిలో ఉంది..? మన భారత విద్యా రంగం స్టాంపులు, సర్టిఫికేట్ల వ్యవస్థగా మారింది. సర్టిఫికేట్లు వస్తే.. ఉద్యోగాలు వస్తాయని కోట్లాది మంది ప్రజలు భావిస్తున్నారు. ఇదంతా పచ్చి అబద్ధం. అలా చేస్తే మీ పిల్లలు దేశంలో ఎలాంటి ఉపాధి పొందలేరు. ఈ బిలియనీర్లు దేశ ఉపాధి వ్యవస్థను నాశనం చేస్తున్నారు" అని ఆరోపించారు. మరోవైపు, ఆర్ఎస్ఎస్ నేతలపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విరుచుకుపడ్డారు. "ప్రస్తుతం హస్తం పార్టీని తప్పుపడుతున్న ఆర్ఎస్ఎస్ నేతలు స్వాతంత్ర్యం కోసం ఎటువంటి పోరాటం కూడా చేయలేదు. పేదరికం, నిరుద్యోగం నుంచి ప్రజలు విముక్తి పొందాలంటే రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి" అని ప్రజలకు పిలుపునిచ్చారు.

# రేషన్ ఇచ్చేది కేంద్రమైతే రాష్ట్ర ప్రభుత్వం ఫొటో ఎందుకు? : కేంద్ర మంత్రి బండి సంజయ్

కేంద్ర సంక్షేమ పథకాలకు కేంద్రం పేర్లు పెట్టాలి అని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు.

**హైదరాబాద్, జనవరి 27, (రిపబ్లిక్ న్యూస్):** కేంద్ర సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వం పేర్లనే రాష్ట్రాలు పెట్టాలని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. హైదరాబాద్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధులు కేంద్ర ప్రభుత్వం ఇస్తే ఇందిరమ్మ పేరు ఎలా పెడతారని ప్రశ్నించారు. రేషన్ ఇచ్చేది కేంద్రమైతే రాష్ట్ర ప్రభుత్వం ఫొటో ఎందుకు పెడుతున్నారన్నారు. పేదల ఇళ్ల కోసం కాకుండా పేర్ల కోసం కాంగ్రెస్ నేతలు పాకులాడుతున్నారని విమర్శించారు. ఇస్తామన్న ఆరు గ్యారంటీలు ఇంకా ఎందుకు అమలు చేయట్లేదని నిలదీశారు. "రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రగతికి సహకరిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల పేర్లను మార్చేస్తోంది. మాకు ఎలాంటి భేషజాలు లేవు.. కేంద్రం, రాష్ట్రం కలిస్తేనే అభివృద్ధి. పద్మ అవార్డులు స్థాయి ఉన్న వారికి ఇస్తాం. గద్దర్‌కు అవార్డు ఎలా ఇస్తాం? భాజపా కార్యకర్తలను, పోలీసులను చంపిన వారికి అవార్డులు ఎలా ఇస్తాం. తెలంగాణ సెంటిమెంట్తో లాభపడింది ఎవరో ప్రజలకు తెలుసు" అని బండి సంజయ్ అన్నారు.



# గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకెళ్లడమే లక్ష్యం: మంత్రి నిమ్మల

పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం పూర్తిగా సహకరిస్తోందని ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

**విజయవాడ, జనవరి 27, (రిపబ్లిక్ న్యూస్):** పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం పూర్తిగా సహకరిస్తోందని ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రూట్ మ్యాప్ ప్రకారం ప్రాజెక్టు పనులు చేస్తున్నట్లు చెప్పారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. పోలవరం ఎడమ కెనాల్ నిర్మాణాన్ని పూర్తి చేసి గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తి చేసి ఆ ప్రాంతం రుణం తీర్చుకుంటామన్నారు. "రాష్ట్రంలో ట్రిపుల్ ఇంజిన్ సర్కారు ఉంటే ఎంత మేలు జరుగుతుందో ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు అర్థమవుతోంది. రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. పోలవరంతో పాటు.. ప్రకాశం జిల్లాకు తాగునీరు, సాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టుకు గత ప్రభుత్వం చేసిన ద్రోహం అంతా ఇంతా కాదు. 2025లో చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని నిమ్మల రామానాయుడు తెలిపారు.



# నాటి కన్నీటి గాథలు.. ఇచ్చిన ప్రతి హామీ గుర్తున్నాయి: నారా లోకేశ్

యువగళం పాదయాత్ర తనకు జీవితకాలం గుర్తుండిపోయే అరుదైన జ్ఞాపకమని మంత్రి నారా లోకేశ్ తెలిపారు.

**అమరావతి, జనవరి 27, (రిపబ్లిక్ న్యూస్):** యువగళం పాదయాత్ర తనకు జీవితకాలం గుర్తుండిపోయే అరుదైన జ్ఞాపకమని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. "నియంతృత్వాన్ని, నిర్బంధాలను దాటుకొని రాష్ట్రంలోని 11 ఉమ్మడి జిల్లాలు, 97 నియోజకవర్గాలు, 2,097 గ్రామాలు మీదుగా 226 రోజుల పాటు 3,132 కిలోమీటర్లు సాగిన చరిత్రాత్మక యువగళం పాదయాత్ర మొదలై నేటికి రెండేళ్లు.

నాటి పాలకులు దీన్ని ఆపేందుకు చేయని ప్రయత్నం లేదు. మైక్ వెహికల్ సీజ్ చేయడం నుంచి యువగళం వాలంటీర్లను అరెస్టు చేయడం వరకూ అనేక విధాలుగా ఇబ్బందులు పెట్టారు. నాటి పాలకులు ఎన్ని అడ్డంకులు పెట్టినా ప్రజలు చూపించిన ప్రేమ నన్ను మరింత దృఢంగా మార్చింది. పాదయాత్ర ప్రతి అడుగులో ప్రజల కష్టాలు చూశాను. ఆరోజు చూసిన కన్నీటి గాథలు నేటికీ గుర్తున్నాయి. ఇచ్చిన ప్రతి హామీ గుర్తుంది. ప్రజల ఆకాంక్షకు తగ్గట్టుగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది. హామీలు అన్ని క్రమపద్ధతిలో అమలు చేస్తున్నాం. యువగళం పాదయాత్రలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగమైన ప్రతి ఒక్కరికీ, నన్ను ఆదరించిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు" అని లోకేశ్ పోస్టు పెట్టారు.



### యువగళం.. రాజకీయ ముఖచిత్రాన్ని మార్చివేసింది: మంత్రి నారాయణ

అరాచక పాలన అంతానికి లోకేశ్ పాదయాత్ర నాంది పలికిందని మంత్రి నారాయణ అన్నారు. యువగళం పాదయాత్రతో రాజకీయ ముఖచిత్రాన్ని మార్చివేశారన్నారు.

### తెదేపా కేంద్ర కార్యాలయంలో వేడుకలు

యువగళానికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తెదేపా కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. నేతలు, కార్యకర్తలు కేక్ కట్ చేసి, టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. లోకేశ్ పాదయాత్ర ప్రజలకు ఒక భరోసా కల్పించిందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్రెడ్డి అన్నారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టునే పనిలోనే లోకేశ్ ఉన్నారని ఏపీ ఫైబర్నెట్ చైర్మన్ జీవీరెడ్డి అన్నారు. కార్యకర్తలకు తానున్నానని భరోసా ఇస్తున్నారని చెప్పారు. లోకేశ్ పాదయాత్రతో వైకాపా నేతలకు వణుకు పుట్టిందని నాదెండ్ల బ్రహ్మం అన్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# 'హరి హర వీరమల్లు'.. బాబీ దేవోల్ లుక్ రిలీజ్

'హరిహర వీరమల్లు' టీమ్ కొత్త పోస్టర్ షేర్ చేసింది.
నేడు బాబీ దేవోల్ పుట్టినరోజు సందర్భంగా ఆయన లుక్కు రిలీజ్ చేసింది.



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రానున్న చిత్రం 'హరి హర వీరమల్లు'. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ మూవీగా ఇది సిద్ధవ-ువుతోంది. ఈ చిత్రంలో బాబీదేవోల్ విలన్గా కనిపించనున్న విషయం తెలిసిందే. నేడు ఆయన పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఓ కొత్త పోస్టర్ను విడుదల చేసింది. అందులో రాజుల కాలం నాటి దుస్తుల్లో ఉన్న బాబీ కత్తి పట్టుకొని యుద్ధానికి సిద్ధవ-ువుతున్నట్లు కనిపించారు. ప్రస్తుతం బాబీ లుక్ సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. రెండు భాగాలుగా రానున్న ఈ మూవీ తొలిభాగం 'హరిహర వీరమల్లు పార్ట్ 1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది. అనుపమ్ఖేర్, బాబీ దేవోల్, నిధి అగర్వాల్, నోరాహి ఫతేహి, విక్రమ్ జీత్, జిషుసేన్ గుప్త కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎం. ఎం. కీరవాణి స్వరాలు అందిస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఇది రానుంది. ఇటీవల ఈ సినిమాలోని 'మాట వినాలి' అనే పాటను విడుదల చేయగా అది మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. పవన్ కల్యాణ్ ఆ పాటను స్వయంగా పాడారు. ఇందులో పవన్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా.. స్వాతంత్ర్యం కోసం పోరాడే ఓ యోధుడుగా కనిపించనున్నారు. 2025 మార్చి 28న ఈ చిత్రం మొదటిభాగం ప్రేక్షకుల ముందుకురానుంది. 'యానిమల్'తో అందరి దృష్టిని ఆకర్షించిన బాబీదేవోల్ ప్రస్తుతం బాలీవుడ్, టాలీవుడ్లలో వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆయన హరిహర వీరమల్లు గురించి మాట్లాడుతూ.. ఇది అందరికీ కనెక్ట్ అయ్యే చిత్రం అని అన్నారు. స్క్రిప్ట్ చాలా ఆసక్తిగా అనిపించిందని, ఎన్నో భావోద్వేగాలున్నాయన్నారు. 'యానిమల్' విడుదలకు ముందే ఈ చిత్రబృందం తనను సంప్రదించినట్లు తెలిపారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

## ఆ సన్నివేశాన్ని తొలగించాలి..
## :రష్మిక కొత్త సినిమాపై మంత్రి వ్యాఖ్యలు

విక్కీ కౌశల్, రష్మిక ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న 'ఛావా' వివాదాల్లో చిక్కుకుంది. ఈ సినిమాలోని ఓ సన్నివేశంపై మహారాష్ట్ర మంత్రి అసహనం వ్యక్తంచేశారు. వెంటనే దానిని తొలగించాలని డిమాండ్ చేశారు.



ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా చేసుకొని బాలీవుడ్లో రూపుదిద్దుకుంటోన్న చిత్రం 'ఛావా'. శంభాజీ మహారాజ్ పాత్ర విక్కీ కౌశల్ నటిస్తున్నారు. విడుదలకు ముందే ఈ సినిమా వివాదాల్లో చిక్కుకుంది. ఇటీవల విడుదలైన ట్రైలర్ లో ఓ సన్నివేశంలో విక్కీ కౌశల్ డ్యాన్స్ చేయడంపై మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సామంత్ అసహనం వ్యక్తంచేశారు. ఆ సన్నివేశాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. "శంభాజీ మహారాజ్ డ్యాన్స్ చేస్తున్నట్లు ఈ చిత్రంలో చూపించారు. ఆ సన్నివేశాన్ని దర్శకుడు వెంటనే తొలగించాలి. సినిమా విడుదలకు ముందు చరిత్రకారులు, స్కాలర్స్కు చూపించాలి. వాళ్లు ఒకవేళ ఏదైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తే మేము ఈ సినిమా విడుదలకు అంగీకరించం" అని ఉదయ్ మీడియాతో తెలిపారు. మీడియాతో మాట్లాడటానికి ముందు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. శంభాజీ మహారాజ్ జీవితాన్ని వెండితెర పైకి తీసుకువస్తున్నందుకు చిత్రబృందాన్ని మెచ్చుకుంటూనే మహారాజ్ కీర్తిని తక్కువ చేస్తే తాము సహించమని అన్నారు. "ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవితాన్ని ఆధారంగా చేసుకొని హిందీలో సినిమా సిద్ధం కావడం ఆనందించదగిన విషయం. ఛత్రపతి చరిత్ర గురించి ప్రపంచానికి తెలియజేసేలా చిత్రాలు రూపొందాలి. ఏది ఏమైనా ఈ సినిమాలోని పలు సన్నివేశాలపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. చరిత్ర గురించి పూర్తి అవగాహన ఉన్నవారికి చూపించకుండా దీనిని విడుదల చేయడం సరికాదు. మహారాజ్ కీర్తిని దెబ్బతీసేలా ఏదైనా ఉంటే మేము సహించం. కాబట్టి చిత్ర దర్శక, నిర్మాతలు అలాంటి సన్నివేశాలు ఏమైనా ఉంటే వెంటనే తొలగించడం మంచిది. అలాకానిపక్షంలో విడుదలకు అనుమతివ్వం. సినిమా చూసి తదుపరి నిర్ణయం తీసుకుంటాం" అని రాసుకొచ్చారు. లక్ష్మణ్ ఉటేకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రష్మిక కథానాయిక. ఇందులో ఆమె శంభాజీ మహారాజ్ సతీమణి యేసుబాయి పాత్రలో కనిపించనున్నారు. ఫిబ్రవరి 14న ఈ చిత్రం విడుదల కానుంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. విక్కీ కౌశల్, రష్మిక నటనను సినీప్రియులు మెచ్చుకున్నారు. ఇలాంటి ప్రాజెక్ట్ లో భాగం కావడం నిజంగా తన అదృష్టం అని రష్మిక తెలిపారు.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1926:** మొట్టమొదటిసారి టెలివిజన్ ను – లండన్ లో ప్రదర్శించారు.
- **1928:** కవి, రచయిత, న్యాయవాది, కళాప్రపూర్ణ పోతుకూచి సాంబశివరావు జననం (మ.2017).
- **1974:** శ్రీలంకకు చెందిన మాజీ క్రికెట్ ఆటగాడు చమిందా వాస్ జననం.
- **1979:** న్యూజీలాండ్ క్రికెట్ క్రీడాకారుడు డేనియెల్ వెట్టోరీ జననం.
- **1986:** న్యాయవాది, మంత్రివర్యులు అనగాని భగవంతరావు మరణం (జ.1923).
- **1988:** భారత్ లో హెలికాప్టర్ ద్వారా ఉత్తరాల రవాణాను ప్రారంభించారు.
- **2009:** భారత మాజీ రాష్ట్రపతి, రాజనీతివేత్త, స్వాతంత్ర సమరయోధుడు రామస్వామి వెంకట్రామన్ మరణం (జ.1910). (చిత్రంలో)



టెలివిజన్



పోతుకూచి సాంబశివరావు



చమిందా వాస్



డేనియెల్ వెట్టోరీ



అనగాని భగవంతరావు



రామస్వామి వెంకట్రామన్

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## ఛాంపియన్స్ ట్రోఫీ..
## 'బుమ్రా వంద శాతం ఫిట్నెస్ సాధిస్తే అద్భుతమే'

భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఫిట్నెస్ గురించి ఒక అప్డేట్ బయటికి వచ్చింది.




ఛాంపియన్స్ ట్రోఫీ ముంగిట టీమ్ ఇండియాకు షాక్ తగిలేలా ఉంది. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఈ మెగా టోర్నీలో ఆడటంపై ఇంకా స్పష్టత లేదు. బోర్డర్–గావస్కర్ చివరి టెస్టు సందర్భంగా వెన్నెముకకు గాయం కావడంతో అతను మైదానం వీడిన సంగతి తెలిసిందే. అయితే, ఛాంపియన్స్ ట్రోఫీకి బుమ్రాను ఎంపిక చేశారు. టోర్నీ ప్రారంభ సమయానికల్లా అతను కోలుకొని వంద శాతం ఫిట్నెస్ సాధిస్తాడని సెలక్టర్లతోపాటు బీసీసీఐ ఆశిస్తోంది. ఈనేపథ్యంలో భారత స్టార్ పేసర్ ఫిట్నెస్ గురించి ఒక అప్డేట్ బయటికి వచ్చింది. బుమ్రా పరిస్థితి గురించి బీసీసీఐ వైద్య బృందం న్యూజిలాండ్కు చెందిన ఆర్థోపెడిక్ సర్జన్ రోవాన్ షౌటెన్తో సంప్రదింపులు జరుపుతోందని బీసీసీఐ వర్గాలను ఉటంకిస్తూ జాతీయమీడియాలో వార్తలొస్తున్నాయి. ఈక్రమంలో అతడిని న్యూజిలాండ్కు పంపించే యోచనలో ఉన్నట్లు ఆ కథనాలు పేర్కొంటున్నాయి. కివీస్ డాక్టర్ రోవాన్ షౌటెన్ ఇచ్చే నివేదికను బట్టి బుమ్రాను ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడించాలా? వద్దా అనే నిర్ణయాన్ని బీసీసీఐ తీసుకోనున్నట్లు తెలుస్తోంది. 2022 టీ20 ప్రపంచకప్నకు గాయం వల్ల బుమ్రా దూరమైన సమ-యంలో అతడికి శస్త్రచికిత్స చేసింది షౌటెన్ కావడం గమనార్హం. మరోవైపు.. ఛాంపియన్స్ ట్రోఫీ ఆరంభానికి తక్కువ సమయమే ఉండటంతో బుమ్రా వంద శాతం ఫిట్నెస్ సాధిస్తే అద్భుతమే అని సెలక్టర్లకూ తెలుసంటూ బీసీసీఐ వర్గాలు జాతీయ మీడియాతో పేర్కొన్నాయి. 'బీసీసీఐ వైద్యబృందం న్యూజిలాండ్ డాక్టర్ రోవాన్ షౌటెన్ టచ్లో ఉంది. బుమ్రాను న్యూజిలాండక్కు పంపాలని బోర్డు ప్లాన్ చేసింది. కానీ, అది ఇంకా జరగలేదు. ఇచ్చిన సమయంలోపు బుమ్రా వందశాతం ఫిట్గా మారితే అది అద్భుతమే అని సెలక్టర్లకు తెలుసు' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. బుమ్రాకు బ్యాకప్ హర్షిత్ రాణా, మహ్మద్ సిరాజ్ను సిద్ధం చేయాలని సెలక్టర్లు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది.

## ఆరోగ్యం

# ఆరు రకాల చేపలు ఆరోగ్యానికి చాలా ప్రమాదం, పాదరసం ఎక్కువ అస్సలు తినకండి

కొన్ని రకాల చేపల్ని తినకూడదు. ఇవి ఆరోగ్యానికి మేలు చేయకపోగా.. హాని చేస్తాయి. ఆ చేపలేంటి, వాటిని ఎందుకు తినకూడదో ఇక్కడ తెలుసుకుందాం.

చాలా మంది చేపల్ని ఇష్టంగా తింటారు. కొంతమందికి చేప లేనిదే ముద్దదిగదు. ఇక, ఆదివారం వచ్చిందంటే చాలు చాలా మంది చేపను ఓ పట్టు పడతారు. చేప పులుసు, చేప ఫ్రై, చేప బిర్యానీ ఇలా ఏ ఐటమ్ అయినా సరే తగ్గేదే లే అంటున్నారు. ఇక చేపలు తినడం వల్ల ఆరోగ్యానికి బోలెడు ప్రయోజనాలు ఉంటాయి. చేపల్లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ డి, విటమిన్ బి2, కాల్షియం, ఫాస్ఫరస్, ఐరన్, జింక్, అయోడిన్, ప్రోటీన్లు మెండుగా ఉంటాయి. అయితే, కొన్ని రకాల చేపల్ని తినకూడదు. ఇవి ఆరోగ్యానికి మేలు చేయకపోగా.. హాని చేస్తాయి. ఆ చేపలేంటి, వాటిని ఎందుకు తినకూడదో ఇక్కడ తెలుసుకుందాం.

### మాకేరెల్



మాకేరెల్ సాధారణంగా ఒమేగా–3లకు మంచి మూలం. వీటిలో ఆరోగ్యకరమైన ఆహారంగా డైలీ డైట్లో భాగం చేసుకోవచ్చు. కానీ పసిఫిక్ మహాసముద్రంలో ప్రత్యేకంగా కనిపించే కింగ్ మాకెరెల్, అధిక మొత్తంలో పాదరసం కలిగి ఉంటుంది. పిల్లలు, గర్భిణులు వీటికి పూర్తిగా దూరంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. వీటిని తినడం వల్ల కిడ్నీలు, నాడీ వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే వీటిని ఎక్కువ మోతాదులో తినకండి. తక్కువ మోతాదులో తింటే మంచిదంటున్నారు నిపుణులు.




### ట్యూనా



మాకేరెల్ లానే ట్యూన్ ఫిష్ కూడా పాదరసం యొక్క వివిధ స్థాయిలను కలిగి ఉంటుంది. ఉదాహరణకు, బ్లూఫిన్, బిగ్ ఐ ట్యూనా స్టిక్ వంటి చేపలకు దూరంగా ఉండటం ఉత్తమం. అల్బాకోర్ ట్యూనాలో ఒమేగా–3లు ఎక్కువగా ఉంటాయి, అయితే మీరు దీన్ని వారానికి ఒకసారి కంటే ఎక్కువ తినకూడదు. ఈ విషయం ఎల్లోఫిన్కు కూడా వర్తిస్తుంది. క్యాన్డ్ లైట్ ట్యూనా ప్రోటీన్ యొక్క మంచి. అయితే దీనిని వారానికి రెండు సార్లు మించి తినకూడదు. ఎక్కువ తింటే మెదడు పనితీరు, నరాల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అంతేకాకుండా వీటిని కొన్నిసార్లు హార్మోన్లు, యాంటీ బయోటిక్స్తో ఇంజెక్ట్ చేస్తారు. ఇవి ఆరోగ్యానికి హానికరం.

### తిలాపియా



అధిక గిరాకీ కారణంగా, తిలాపియా చేపల్ని విస్తృతంగా సాగు చేస్తున్నారు. ఇవి మార్కెట్లలో ఎక్కువగా లభిస్తుంటాయి. అయితే డిమాండ్ కారణంగా ఈ చేపలకు వాణిజ్య మేత లేదా కోడి వ్యర్థాలను అందిస్తారు. ఇవి ఆరోగ్యానికి మంచివి కావు. పెద్ద మొత్తంలో తిలాపియా తీసుకోవడం వల్ల గుండెపోటు, స్ట్రోక్, ఆస్తమా వంటి ప్రమాదాల్ని పెంచుతుందని నివేదికలు సూచిస్తున్నాయి. తిలాపియాలో ప్రోటీన్ స్థాయిలు తక్కువగా ఉంటాయి. డైబ్యూటిల్టిన్ అనే రసా-యనాన్ని కలిగి ఉంటుంది. ఇది కొందరిలో ఉబ్బసం, అలెర్జీలను ప్రేరేపిస్తుంది. అందుకే ఇలాంటి చేపల్ని ఎక్కువగా తినకండి.

### బసా చేప



బసా చేప అనేది క్యాట్ ఫిష్ రకం. చాలా రెస్టారెంట్లలో వీటిని చేపల కూరలకు ప్రత్యామ్నాయంగా ఉపయోగిస్తున్నారు. అయితే బసా ఫిష్లో కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచే హానికరమైన కొవ్వు ఆమ్లాలు ఉన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. శ్వాసకోశ సమస్యలు లేదా ఆర్థరైటిస్ ఉన్నవారు ఈ చేపకు దూరంగా ఉండాలి.

### సార్డిన్



ట్యూనా, మాకేరెల్ మాదిరిగానే, సార్డినెస్ సముద్రపు చేపలు. ఇవి అధిక మొత్తంలో పాదరసం కలిగి ఉంటాయి. ఇవి గణనీయమైన ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తాయి. వీటిని ఎక్కువ తింటే మెదడు ఆరోగ్యం దెబ్బ తినే ప్రమాదముంది. చిన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలు ఈ రకం చేపలకు దూరంగా ఉండాలి. నరాల ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.

### క్యాట్ ఫిష్



ఇవి నీటిలో డైరెక్ట్గా దొరికి తింటే వేరు. అయితే మార్కెట్లో దొరికే క్యాట్ ఫిష్లు కొనేటప్పుడు జాగ్రత్త. ఇవి తరచుగా హార్మోన్లతో ఇంజెక్ట్ చేయబడతాయి, వీటిని తీసుకోవడం హానికరం. మార్కెట్ నుంచి పెద్ద సైజులో ఉన్న క్యాట్ ఫిష్ కొనుగోలు చేయకుండా ఉండటం మంచిది. వాటికి బదులు చిన్న సైజులో ఉన్న క్యాట్ ఫిష్లు బెస్ట్ ఆప్షన్. ఎందుకంటే ఇవి సన్నగా ఉండటం వల్ల ఆరోగ్యానికి సురక్షితమైనవి.

### తినాల్సిన చేపలు

- సాల్మన్ చేప
- హిల్సా చేప
- ఇంగువ చేపలు లేదా ఆంకోవి
- ట్రౌట్ చేపలు
- ఈ చేపల్లో ఒమేగా–3 కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా లభిస్తాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. స్ట్రోక్, అల్జీమర్స్ వంటి వ్యాధుల ముప్పును తగ్గిస్తాయి. అందుకే డైట్లో ఇలాంటి చేపల్ని భాగం చేసుకోండి.

**గమనిక**

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.